# విలువ లేని అనుభవాలు

యన్. ఆర్. నంది

ఛెంగు ఛెంగున గెంతుకొంటూ పరుగు పరుగున యింటికి వచ్చాను. వచ్చీ రాగానే బల్లమీద పుస్తకాలు విసిరేసి, అమ్మ యివ్వబోయే కాఫీని గూడ తీసుకోకుండా మైదానం వేపు పరుగు తీశాను.

పక్క మంచంలో కూచొని చుట్ట కాల్చుకొంటున్నాడు తాతయ్య. నన్ను చూడగానే నవ్వుతూ చేతులు చాచాడు. ఒక్క దూకులో తాతయ్య ఒళ్ళో వాలిపోయాను.

నా శరీరాన్నంతనీ వేయి నోళ్ళతో ముద్దులాడాడు.

"ఇంతవరకూ ఎక్కడున్నావు బాబూ?" అనడిగాడు, నా ముఖాన్ని రెండుచేతులతో తన ముఖం దగ్గరకి తీసుకొంటూ.

"లంకమీద ఆడుకొంటున్నాను తాతయ్యా. రామూ, రంగడూ, సత్యం, బుచ్చీ నేనూ కలసి దొంగాటాడాం. నేను ఒక్కసారీ దొంగవలేదు. అస్తమానం సత్యంగాడే అవుటయేవాడు. చివరికి ఉడుక్కుపోయి మా ఆట పెట్టాడు కాదు. మేమందరం వాడిచుట్టూచేరి ఉడికించాం." ఏవేవో అంతులేని ఆనందంతో గుక్క తిప్పుకోకుండా చెప్పేస్తున్నాను. అన్నం తిని యిక్కడి పరుగెత్తుకొని వచ్చేవరకూ జరిగినవన్నీ చెప్పి తృప్తిగా ఒక చిరునవ్వు నవ్వాను.

తాతయ్య నన్ను ముద్దుపెట్టుకొంటూ పక్కన కూచోబెట్టుకొన్నాడు.

నా ఘనకార్యాలని వల్లించలేక నేనే అలసిపోయాను. శ్వాస కొస్త సమ్మదించిన తర్వాత తాతయ్యతో అన్నాను: "కథ చెప్పవు తాతయ్యా?"

"ఏం కథ? రోజూ కథలంటావు. నా కొచ్చిన కథలన్నీ చెప్పేశాను. 'ఇంకేం మిగిలాయని నీకు చెప్పడానికి?

"రోజూ అలానే అంటుంటావ్, ఏదో మళ్ళీ కొత్తకథ చెబుతూనే వుంటావ్ ... అలానే ఈవాళ గూడా ఓ కథ చెప్పు తాతయ్యా."

తాతయ్య నానించి తప్పించుకో లేక పోయాడు.

"సరే. కథేవిటి? రోజూ చెబుతున్నదే నైధవది. ఈవాళ 'యత' చెబుతాను వింటావా?"

ఈ 'యత' అనేమాట నాకు కొత్తగా వినిపించింది.

"యతే చెప్పు తాతయ్యా."

ఆరిపోయిన చుట్ట తీసి పక్కన పెట్టి మెల్లగా మంచంమీద మేను వాల్చాడు. నన్ను గూడా తన పక్కన పడుకోబెట్టుకొన్నాడు. కథలు వినడానికి తాతయ్య పక్కలో, కోడిపిల్లలు తల్లి రెక్కలకింద ఇమిడేటట్టు, నేను పడుకోవడం పరిపాటే. తాతయ్య గూడా తన కుడి చేతిని, నా తలమీదుగా భుజాలమీద జోల పాటలు పాడిస్తాడు. ఈవాళ గూడా అంతే!

యత ప్రారంభించాడు.

"అనగా అనగా ఓ వూళ్ళో ఓ అమ్మా, నాన్నా వున్నారు."

"ఏవూళ్ళో తాతయ్యా?"

"ఒక వూరు. ఏదో ఒక వూరు. పేరెందుకులే... ఆ అమ్మా నాన్నకి ఓ కొడుకు. ఆ కొడుక్కి వాళ్ళేదో పేరు పెట్టారులే. పేరు లేకుండా ఎవరూ వుండరు కదు బాబూ! ఆ అబ్బాయి రోజు రోజుకీ యింతా, అంతా పెద్ద వాడవుతున్నాడు. 'మ్మ' 'త్త' 'న్న' అనే మాటలు గూడా నేర్చుకొంటున్నాడు. బంగరడం దగ్గరనుంచీ, తప్పటడుగులు వేస్తూ, పరుగెత్తడం వరకూ నేర్చుకొన్నాడు... కాదు. తిరుగుతున్న కాలం ఆ అబ్బాయికి వాటన్నిటినీ నేర్పించింది!

"అబ్బాయికి ఐదేళ్ళు వచ్చాయి. అయిదేళ్లు వచ్చేయంటే ఏం చేస్తారు?

"ఆటలాడుకొంటాడు."

"కాదు. అక్షరాభ్యాసం చేయిస్తారు."

"ఆఁ. అవునవును. పలకలు, బలపాలు పంచిపెడతారు."

"హాఁ. అదే! అంటే బడికి వెళ్లి మంచి, మంచి పాఠాలు చదువుకొని గొప్పగొప్ప విషయాలు నేర్చుకోవడమన్న మాట!

"ఆ అబ్బాయి రోజూ బడికి వెడుతూంటే ఆఅమ్మా నాన్నలు ఎంతో మురిసిపోయేవారు. ఎంతో ముద్దుగా, కోరిందల్లా నెరవేరుస్తూ పెంచుతున్నారు. అమ్మా నాన్నా నీకు రోజూ అన్నంపెట్టి, ముస్తాబుచేసి బడికి పంపించడం లేదూ? అలాగే నన్నమాట."

"మరి ఆ అబ్బాయి రోజూ ఆడుకొనేవాడా?"

"ఆఁ. మంచిమంచి ఆటలు ఆడుకొనేవాడు. కోతి కొమ్మచ్చి, దొంగాట, ఎండానీడా ఆటలన్నమాట. అలాగే ఆడుతూ పాడుతూ చదువుకొంటూ ఆ అబ్బాయి యింతా అంతా పెద్దవాడవుతున్నాడు. బడిలోగూడ మంచిమంచి పాఠాలు నేర్చుకొంటూ, పరీక్షల్లో ఫస్టుగా పాసవుతూ మాస్టర్లందరిచేతా భేష్ అనిపించుకొంటున్నాడు.

"అంతలో ఆ కుర్రాడికి యుక్తవయస్సు వొచ్చిందట."

"ఆఁ...?" ఈ నోరుతిరగని మాట కర్థం తెలీలేదు.

"అంటే పెద్దవాడయాడన్న మాట. బళ్లో అన్ని పరీక్షలూ పాసయి యింటి కొచ్చేశాడు."

"ఎందుకు?"

"ఇక చదువు పూర్తయిపోయింది."

"మరిక చదువుకో నవసరంలేదూ?"

"ఊహుఁ. అంతటితో ఆ చదువు ఆఖరు. ఐతే యిప్పుడతను ఉద్యోగంకోసం ఊరంతా తిరిగాడట. అప్పుడు పనులా శ్రమలేకండానే దొరికేవి. అందువల్ల సాయంకాలానికి ఓపని దొరికిందట."

"ఏంపని తాతయ్యా?"

"ఏదో ఒకపని, పొట్టకోసం."

పొట్టకోసం పని. ఈ 'లింక్' ఏమిటో అప్పుడు నాకు తెలీకపోయినా అలస్యాన్ని భరించలేక ఊకొట్టాను.

"ఐతే అతను అలాగలా పని చేస్తూచేస్తూ కొంత డబ్బు కూడబెట్టాడట. ఒక రోజున అతని అమ్మా నాన్న అతని దగ్గరికొచ్చి 'బాబూ, యిక నీకు యుక్తవయ స్సొచ్చింది, పెళ్ళిచేసుకొని ఒక యింటివాడవు కావాలి' అన్నారట. అతను సిగ్గుతో 'సరే' అన్నాడట."

"పెళ్ళి అయిపోయింది. పెళ్లాం యింటికొచ్చింది."

నాకెందుకో చాల సంతోషమయింది. అప్రయత్నంగా, కారణం తెలీకండానే చప్పట్లు కొట్టి నవ్వాను. నా నవ్వులోని గూఢార్థాన్ని తాతయ్య గ్రహించగలిగాడో లేదో గాని, ఆ చిన్న వయసులో ఆ 'ఉద్రేకం' నా కలా ఎందుకు కలిగిందో అర్థం కాలేదు.

"అతనికి పెళ్ళి, పెళ్ళి అయిపోయింది. పెళ్ళాం అతనితో కాపరం చెయ్యడానికి వచ్చింది. ప్రొద్దుట పని చేసేవాడు. ఎందుకు?"

"ఊఁ..." అలస్యాన్ని భరించలేక మూలిగాను.

"అలా మరిచిపోతే ఏలా? పని చేయడం పొట్టకోసం."

"ఆఁ ఆఁ పొట్టకోసం..."

"మరి ఇంట్లో పెళ్ళాం ఎంచక్కా అన్నం వండి, వండింది వడ్డించి, వడ్డించింది అతను తిన్నాడో లేదో సరిగా చూసి, సరిగా చూసిన తర్వాత విస్తరెత్తి పారేసి, తను తర్వాత తినేది."

"అవును సత్యవతి గూడా నాకు లక్కపిడతల్లో బువ్వ అలాగే పెడుతుంది తాతయ్యా."

"రేప్పొద్దుట దాన్నే పెళ్లాడుదువుగానిలే."

ఆ మాటకి తాతయ్య ఛాతీమీద ఓటి తగల్నిచ్చాను. తాతయ్య నవ్వి తిరిగి ప్రారంభించాడు.

"ఇలాగలాగ, అలాగిలాగ రోజులు, రోజుల మీద వారాలు, వారాలమీద నెలలు, నెలల మీద ఏడాదులు గడచిపోతున్నాయి. అతనికి ఒకరోజున మంచి కొడుకు పుట్టాడట, కొడుకు పుడితే ఎంత సంబరపడ్డాడతను? ఒహ్! మిఠాయిలే కాదు, జిలేబీలే కాదు, కోవాలే కాదు–అన్నీ పంచిపెట్టాడట."

"ఎందుకు?"

"సరదా. కొడుకు పుట్టాడుకదూ! ఆ కొడుకంటే! అతనికెంతో ప్రేమ. అతనికే కాదు. అతని పెళ్ళానికి గూడా ఎంతో ప్రేమ! యిద్దరూ ఆ కొడుకుమీద ఈగనయినా వాలకండా ఎంతో ప్రేమగా చూసుకొంటున్నారు. ఆ పిల్లాడు అలా అలా పెరుగుతూ రెండేళ్ళ వాడయేసరికి, వాడికి మరో తమ్ముడు పుట్టాడట."

"మరి వాళ్ళకి పేర్లు లేవు తాతయ్యా?"

"ఎందుకులేవు. ఉన్నాయి. అవన్నీ చెబితే నువ్వు మరచిపోతావ్. రెండోవాడు ఇంతా అంతా పెద్దవాడయేసరికి ఒక చెల్లెలు పుట్టిందట."

"మరి మొదట పిల్లాడిని బళ్లో వేశారా?"

"ఆఁ. వేశారే..."

"ఆడుకొంటున్నాడా?"

"మహారాజులా. ఆ యిద్దరూ ఆడుకోవడమే గాకండా, ఈ చెల్లెలు గూడా క్రమేపీ పెద్దదై, వాళ్ళతో సమానంగా దొంగాటలాడేదట. ఇంతలో మరో చెల్లెలు పుట్టింది."

"ఈసారి చిన్న చెల్లెలు పుట్టిందన్నమాట!"

"ఆఁ. ఈ చెల్లెలు గూడా ఇంతో అంతో పెద్దదయ్యేసరికి, మరొక చెల్లెలు పుట్టిందట..."

"మొత్తం ఎంత మంది? ఒకటి, రెండు, మూడు, ముగ్గురు చెల్లెళ్ళన్నమాట!"

"ఆఁ ఇంతలో పాపం పెద్దన్నయ్యకి జబ్బు చేసిందట. అతను-అంటే ఎవరు? ఈ పిల్లల నాన్నన్నమాట-అతను పెద్ద కొడుకుని ఓ డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళాడట. ఆ డాక్టరు గూడ పిల్లాడికి మందులు, ఇంజక్షన్లు ఇచ్చాడు. రెండు నెలల తర్వాత పెద్దకొడుకు జబ్బునించి తేరుకొన్నాడు. కాని సన్నగా ఉఫ్ అంటే ఎగిరిపోయేటట్టు తయారయ్యాడట. వాడికి మంచి బలమైన టానిక్కులు, మందులు తినిపించేసరికి, పనిచేస్తూ కూడబెట్టిన డబ్బంతా పూర్తయిపోయింది.

"ఇలాగే కాలం జరుగుతుండేసరికి, మళ్ళా ఓ పిల్ల పుట్టింది. యింట్లో అంతా యింతింత చిన్న పిల్లలు. కాళ్లావేళ్ళా పడేవాళ్లు. బొంగి మొలల్తో ఊరంతా తిరిగేవారు. అలసిపోయిన తర్వాత ఇంటికి తిరిగొచ్చి, తల్లి వేసిన ముద్ద తిని మళ్ళా వీధులంట పడేవారట."

"మరి చదువుకోరూ?"

"ఆఁ ఎందుకు చదువుకోరు? చదువుకొంటారు. కాని వాళ్ళ అమ్మా నాన్నకి శ్రద్ధ ఏదీ? నాన్న పగలంతా పని చేస్తూంటే, అమ్మ వంటింట్లో అన్నాలు వండుతూంటే, వాళ్ళ కోసం శ్రద్ధ తీసుకోనేవాళ్ళెవరు?"

"ప్రయివేటు మాస్టరు లేదూ?"

"ఆ వూళ్ళో కావలసినంత మంది వున్నారు కాని వాళ్లింటికి రారు."

"ఏం?"

"వాళ్ళ నాన్న దగ్గర ఆ ప్రయివేటు మాస్టర్లకిచ్చేంత డబ్బులేదు."

"ఎందుకు లేదు?"

"చేసే ఉద్యోగం చిన్నది కదూ?"

"అయితేమాత్రం ఎక్కువ డబ్బు ఎందుకు దొరకదు."

"దొరకదు. అంతే. ఎందుకు దొరకదో నువ్వు పెద్దవాడవయిన తర్వాత తెలుసుకో."

"నేను పెద్దవాడనయిన తర్వాత ఉద్యోగం చేస్తానేమిటి? ఆడుకొంటూ చదువుకొంటాను గాని."

సరే ఏదో చేద్దువుగాని మొదట నేను చెప్పేది విను. అలాగ అతను పనిచేస్తున్నా సరైన జీతం దొరక్క కష్టాలు పడుతుండేసరికి, మళ్లా భార్యకి పురుడొచ్చింది. మళ్ళా ఆడపిల్ల. ఇక అతనికి విసుగెత్తిపోయింది. పుడుతున్న పిల్లలకి పాల డబ్బాలు తెచ్చేందుకు గూడ డబ్బు లేదు. తల్లిపాలు లేక పిల్లలు చాకలి బానల్లాంటి కడుపులతో, చీపురుపుల్లల్లాంటి కాళ్లు చేతులతో వూరంతా తిరుగుతుండేవారు.

"ఒకరోజున అతనికి జ్వరంవచ్చింది. అంటే మందులివ్వాలి. మందులిస్తే మనిషి బాగుపడతాడన్నమాట."

అప్పట్లో నాకు మనుషులకి జ్వరాలు ఎందుకొస్తాయో అర్థం కాలేదు. అంతకంటే అర్థం కాని పెద్ద సమస్య: జ్వరం వస్తే మందులెందుకు వేస్తారు అని! కాని తాతయ్య చెప్పే కథ మంచి సరదాగా వుండటంవల్ల మధ్య ప్రశ్న వేయలేదు.

"అతను మంచం పట్టాడు. పట్టిన పదిరోజుల్లోనే ఎముకలగూడు అయిపోయాడు. ఇంట్లో పెళ్లాం ఏంచేస్తుంది? ఆడది! ఇరవై నాలుగు గంటలూ అతని దగ్గర కూచొని సేవ చేస్తూండేది. కాని ఆ జబ్బు యింకా ఎక్కువ అవడంతో, యిక లాభంలేదని ఉన్న ఆ ఒక్క కొంపనీ తాకట్టు పెట్టి కొంతడబ్బు తెచ్చింది.

"ఆ డబ్బుకి అతను బాగయ్యాడనుకో. కాని, ఆయింటిమీద అప్పుతీర్చడానికి ఎంతో శ్రమ పడవలసి వచ్చింది. అంకుకు తోడు ఆడపిల్లలు పెద్దవాళ్ళయి యింట్లో వున్నారు. వాళ్ళకి పెళ్లిళ్లు చెయ్యాలి. మగవాళ్ళంటే ఫరవాలేదు. ఆడపిల్లల కలాకాదుగా..."

తాతయ్య చెబుతున్న కథ మాంచి రసవంతంగా వుండటంవల్ల కొబోలు శ్వాస నాసికా మార్గాన్ని వొదిలి నోటి మార్గాన్ని పట్టింది. పెదవులు, గొంతుక, స్వరతంత్రులు గాలి రాపిడికి ఎండి, మాటలు మూగపోయాయి. ఊకొట్టటం లేదు.

"...పిల్లలకి పెళ్లిళ్లు చేశాడు. అప్పటికి చాల అప్పు చేశాడు. మగపిల్లలు గూడ పెళ్లిళ్లు చేసుకొని ఎవరి దారిన వారు విడిపోయారు.

"ఇప్పటికి యింకా ముగ్గురు ఆడపిల్లలు ఒక్క మగపిల్లడు మిగిలారు. అంతలో భార్యకి జబ్బు చేసింది. ఆవిడకి మందులిప్పించలేక అతను కళ్లు తేలేశాడు. ఆమె కళ్లు మూసింది-నలుగురినీ అతని చేతిలో పెడుతూ.

"పిల్లలని తనే పోషిస్తున్నాడు. కాలం వూరుకొంటుందా? ఆ పిల్లలని పెద్ద వాళ్ళని చేసింది. వాళ్ళకి గూడ పెళ్ళిళ్ళు చేశాడు.

"కాని చివర కలిగిన కొడుకు ఒక్కడు మాత్రం మిగిలాడు. వాడిని అతను బాగా చదివించి, పిరోధంతో తన్ని విడిచి పోయిన పెద్ద కొడుకల్లా గాకండా, గొప్పవాడిగా చేయాలనుకొన్నాడు. అప్పటికే అతనికి నడివయస్సు దాటిపోయింది. ఆ పిల్లాడికోసం కష్టపడి పని చేస్తున్నాడు. ఆలాగ చేస్తూనే అప్పులూ బాకీలూ తీర్చేశాడు.

"పిల్లాడు అలాగలా ఎదిగి పెద్దవాడయి పెద్ద చదువులు చదివి వెంటనే ఉద్యోగంకూడ సంపాయించుకొన్నాడు. అప్పటికే అతనికి ఆరవైయేళ్లు నిండడంచేత ఇక వొంగి కష్టపడలేక కొడుకు యింట్లో కుక్కి మంచంలో కూలబడ్డాడు.

"తనకి తానే ఆ కొడుకు పెళ్ళి చేసుకొన్నాడు-తండ్రి అవసరం లేకండా. ఆ తండ్రి కష్టంమీద ఏ కొడుకు పెరిగి పెద్దవాడయ్యాడో, ఆ కొడుకే ఈవేళ ఆ తండ్రిచేత ఒక పైసా అయినా ఖర్చు పెట్టించుకోకండా, స్వతంత్రంగా, తను గడించిన డబ్బుతో పెళ్ళి చేసుకొని ఒక యింటివాడయాడు. అలాంటి కొడుకు యింటో, అతను యిప్పుడు బతుకుతున్నాడు."

తాతయ్య ఆగాడిక్కడ.

"ఇంకా అతను వున్నాడా తాతయ్యా?"

"ఆఁ యింకా వున్నాడు.

"నాకు చూపించవూ?" అన్నాను ఆత్రుతగా.

తాతయ్య నవ్వాడు. "అతనెలా వుంటాడో నీకు తెలుసా?"

"ఏమో?"

"ఎన్నేళ్లుంటా యనుకుంటావ్?"

"ఏమో"

"మరి కథేం విన్నావ్?"

"అంతా విన్నాను కాని..."

"కానిలేదు గీనీలేదు. ఆలోచించి అతని వయస్సెంత వుంటుందో చెప్పు"

చాలసేపు ఆలోచించాను. తెగ లేదు. ముప్పై ఏళ్లు, నలభై, ఏభై-ఏమో! అసలు నా వయస్సుతో అతని వయస్సుని కొలుస్తూ, ఊహిస్తూంటే-ఇంత చిన్నయతలో యిమిడిన ఇతని జీవితం నా పన్నెండేళ్ళ వయస్సుకంటే కొన్ని వందల రెట్లు చిన్నదై వుండి వుండొచ్చు! కాని ఎందుకో మనస్సు అలా చెప్పడానికి అంగీకరించలేదు.

"ఎంతో నాకు తెలీదు తాతయ్యా" అన్నాను మెల్లగా.

"ఇంతేనా నీ చదువు? అతని వయస్సిప్పుడు డె-భై-ఐ-దు" తాతయ్య రాగాలు తీశాడు.

"ఆఁ" అన్నాను ఆశ్చర్యంగా.

"ఏం! వింతగా వుందా? మరి వింతగా వుండదూ. అసలు అతనే అప్పుడప్పుడు ఆశ్చర్య

పోతూంటాడు. "హాకి, నాకు డెబ్భైఐదేళ్లు ఎలా వచ్చాయి!" అని.

"అవును తాతయ్యా ఎలా వొచ్చాయి?"

"ఎలా వచ్చాయి కాదు బాబు, ఎందుకొచ్చాయి? అను. ఎందుకంటే, అత నెప్పుడూ జీవితం గురించిగాని, మనిషి గురించి గాని సావకాశంగా కూచొని వీటి గూడార్థం, అంతరార్థం ఏవిటి అని ఆలోచించుకోలేదు. ఒకవేళ ఆ ఆలోచన కష్ట సమయాల్లో కలిగినా, ఆ బాధలు అతని మనస్సుని, శరీరాన్ని ముళ్ళ కంపలతో కొట్టి, లేపి, పరుగెత్తించింది. అందువల్ల అతను తన్ని గురించి, తన స్థితిగతులని గురించి, తన చుట్టూవున్న వాటిని గురించి తెలుసుకొని, తదనుగుణంగా నడిచేందుకు తగిన వీలు చిక్కలేదు.

"కాని యిప్పుడు కుక్కి మంచంలో కూచొని, సావకాశంగా గుండెమీద చెయ్యి వేసుకొని ఆలోచించుకొంటూంటాడు. "నే నెందుకు పుట్టాను, ఏం చేశాను, ఏం చేస్తూ వెళ్ళిపోతున్నాను" అని! కాని గడచిన కాలం అతన్ని వెక్కిరిస్తూ, అతని కళ్ళముందు తిరుగుతూంటే, చేతగాక ఒక కన్నీటి బొట్టుని, డెబ్భై ఐదేళ్ళ అనుభవంతో, విడుస్తుంటాడు. అతని పళ్ళన్నీ లోకంలోవున్న రుచు లన్నిటినీ చవిచూసి, రాలిపోయాయి. అవి మళ్ళా 'పాల పళ్లు'గా తిరిగి అతని బోసి నోటిలో రావు. వస్తే...?"

తాతయ్య ఆగిపోయాడు.

"వస్తే...?" అని నేను ప్రశ్నించుకో లేదప్పుడు; ఇప్పుడు ప్రశ్నించుకొంటున్నాను ఏదో ఆశతో కాలం విలువని తెలిసికోగలను కదా అని!

అభిప్రాయ వేదిక

# ఆంధ్ర రాజకీయాలు

"ఉమేష్"

ఆంధ్ర రాజకీయాలు ప్రస్తుతం పాదరసంలాగా పట్టుదొరకకుండా దొర్లుతున్నవి. అంతా అయోమయం, గందరగోళంగా ఉన్నది. ఎంతగా బుర్రలు బద్దలుచేసుకున్నా ఇదమిత్థమని అంతుపట్టక ప్రజలు హతమవుతున్నారు. ఆంధ్ర ప్రజాపార్టీ తీర్మానాలకు ప్రకాశంగారి వ్యాఖ్యానాలకు సమన్వయం కుదరక జనాలకు చికాకు కలుగుతున్నది. అడుగులోనే హంస పాదా? అన్న నిరుత్సాహం నుండి తెప్పరిల్లడానికి కొన్నాళ్ళు పడుతుంది. ఇది ఇలా ఉండగా దురదృష్టవశాత్తు సంభవించిన పుత్రవియోగాన్ని పురస్కరించుకొని తలవని తలంపుగా సంజీవరెడ్డిగారు తమ రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షపదవికి రాజీనామా యిచ్చారు. దీనితో ప్రాణాలు కడబట్టి వారి పార్టీవారంతా రాజీనామాను ఉపసంహరించుకోమని విజ్ఞప్తులు చేస్తున్నారు. 'రాష్ట్ర కాంగ్రెసు సంఘానికి పంపించవలసిన రాజీనామాను కాంగ్రెసు అధ్యక్షునికి పంపటంవల్ల అసలది సక్రమమైన రాజీనామా కాదని కళావారు తమ మిత్రులకు కొంత గుండెనిబ్బరం చేకూర్చారు. బెంగుళూరు ఎ. ఐ. సి. సి. సమావేశం ఫలితంగా రాగల పరిణామాలను బట్టి రాజీనామాను గురించిన పూర్తివివరాలను సడికట్ట వచ్చునని కొందరు అనుకొంటున్న మాటలకు ఎంత ప్రాధాన్యం ఉన్నదీ కొన్నాళ్ళకుకాని తెలియదు. ఇంతకీ ఈ రాజీనామా సంగతి ఏమి కాబోతున్నది? బెంగుళూరు సమావేశ పర్యవసానం ఏమవుతుంది? ఎవరిని కదిలించినా ఇవే ప్రశ్నలు. ఎక్కడ చూచినా ఇవే చర్చలు. అన్ని ప్రశ్నార్థకాలే తప్ప ఒక్కటీ ప్రస్ఫుటంగా కనపడటం లేదు. ఈ సందిగ్ధ పరిస్థితులు చివరకు ఏ కాలికి చేరేదీ ఎలా చెప్పడం? అందునా నేటి ఆంధ్ర రాజకీయాల స్థితి అరటిపండు తోలు